# కన్నీటి ఊట

మొలకపల్లి కోటేశ్వరరావు

"ఏమయ్యోయ్...ఎంత సేపు నువ్వు ఆ టీవీముందు కూచున్నా ఆ బొమ్మలేగానీ లేచి బువ్వదిను. పొలం పోయొద్దాం. లేలే కానిచ్చు" భర్త ఎలమందతో అంది కొండమ్మ.

"ఉండవే, ఆట మంచి రసపట్టులో ఉంది. మనోళ్ళు గెలుస్తారో, పరువు తీస్తారో" టీవీలో వస్తున్న క్రికెట్ ఆటని వీక్షిస్తున్న ఎలమంద, భార్య మాటల్ని పట్టించుకోకుండా అన్నాడు.

"ఎందో ఆట అంట ఆట. అదొస్తే చాలు, కూడూ నీళ్ళూ వుండవు. అంత పిచ్చా? ఆట అన్న తరువాత ఒకసారి వాళ్ళు గెలిస్తే, ఒకసారి వీళ్ళు గెలుస్తారు. ఎందుకంత టెంక్షన్?" ముద్దుముద్దుగా భర్తని విసుక్కుంది కొండమ్మ.



"నీకేం తెల్సే ఇందులో వుండరంజు! సరేగనీ, ఇయ్యాల బర్రెని విప్పుకుని పోతేదేందే?" గుర్తొచ్చి నట్లు అడిగాడు.

"ఎక్కడ చూస్తండా? చేటలు అలకడం కనప ట్టంలా! మెంతులు నానేసుకునీ, వాటిని రుబ్బీ, అలికే సరికి ఈ యాల్రైంది. తెచ్చావు చేటలు, ఒక్క దానికైనా ముక్కూమూతీ సక్రమంగా వుండయ్యా! ఏ పని చేసినా అడక్కదినే నే తప్ప ఒక్క పనైనా సక్ర మంగా చేస్తా? కల్లాలకి ఎసుంటి చేటలు ఉండాలీ?" అంటూ బయట ఎండలో పెట్టిన చేటల్లోనించి ఒక వంకర టింకర చేటని తీసుకొచ్చి భర్తకి చూపె డుతూ అంది. "ఇసుంటి చేటలా తెచ్చుకునేదీ?"

"ఇంతకంటే అక్కడ మంచియ్యిలేవే! ఉండవా టిలో ఏరుకుని తెచ్చిన చేటలే ఇయ్యి"

"అక్కడలేకపోతే మంచియ్యి వుండ దగ్గర తెచ్చుకుంటాం" అంది ఆమె.

తరువాత బయటికి వెళ్ళి మెంతులు నానేసిన గిన్నెలూ, రోలూ, పాత్రం కడుక్కోవడంలో మునిగి పోయింది.

చాలా సేపటికి కరెంట్ పోయింది.

కాళ్ళు కడుక్కుని వచ్చిన భర్తకి అన్నం పెట్టి, తనూ ఒక కంచంలో వేసుకుని బయటికి వచ్చి మంచం మీద కూర్చుంది తింటూ.

ఎలమంద అన్నంతిని, సైకిల్ బయట పెట్టాడు. కొండమ్మ కండువా తీసుకుని మడత పెట్టుకుంటూ బయటికి వచ్చి ఇంటికి తాళం వేసింది.

"ఏమే,నేను సైకిల్‌కి గాలికొట్టుకుని వస్తాకానీ నువ్వు పద"అని ఎలమంద సైకిల్ షాపు దగ్గరకి వెళ్ళాడు.

రోజూ వూరి చివరి వరకూ కొండమ్మ నడిచి వస్తే, అక్కడనించీ ఆమెను వెనుక కూర్చోపెట్టుకుని తొక్కుకుంటూ చేలోకి తీసుకుపోతాడు.

ఊరు వెలపలకి వచ్చి కొండమ్మ ఒక చెట్టు కింద నిలబడింది.

ఎలమంద గాలి కొట్టుకుని తొక్కుకుంటూ వచ్చాడు. వెనుక క్యారేజీ సీట్ మీద ఆమె కూర్చుంది. పొలం దారి పట్టారు.

కనుచూపు మేర దారిలో ఎక్కడ చూసినా శనగ చేలే.

వారం రోజుల క్రితం నవనవలాడుతూ పచ్చని పసిమి వర్ణంతో శోభాయమానంగా వున్న చేలు, ఇవ్వాళ పసిడి వర్ణంలోనికి వచ్చి కనువిందు చేస్తూ కోతకి సిద్ధంగా ఉన్నాయి.

మిరప చేను పక్కనే వున్న చెట్టు నీడలో సైకిల్ స్టాండ్ వేసి, మిరప చేలోకి వెళ్ళారు.

చేను చూసిన తరువాత కొండమ్మ అంది "చాలా కాయలు పండిపోయినియ్యి. నాలుగు రోజుల నాడే ఒక వరస కాయలు కోయించినట్టయితే బాగుండేది. రేపు అందరూ ఒకేసారి కోతలకి ఎగబ డతారు. కూలోళ్ళు దొరకడం గగనమయిద్ది. దొరి కినా నోరు పట్టని కాడికి అడుగుతారు"

"ఎంత అడిగినా తప్పేదిముందే? కాయలు కోపిచ్చడం ఇప్పుడు ఎట్ట వల్లయిద్ది? శనగల కోతలై,కల్లాలై ఇంటికి వచ్చిందాకా మిరపకాయల ఎవారం పట్టిచ్చుకునే పనే లేదు. వాటికీ ఈటికీ ఎట్ట కుదిరిద్ది?"

మిరపతోట మనిషి ఎత్తుకి మించి పెరిగింది. విపరీతంగా కాపుకాసింది.

"చూడవే ఎట్ట కాసిందో! రేల గాసిందే"

"తెగ్గాసిందయ్యా" అంది కొండమ్మ కూడా సంతోషంగా.

తోటని చూస్తున్న ఆ భార్యాభర్తల మనసులు పట్టరాని ఆనందంతో పులకించిపోయాయి. ఇద్దరికీ కడుపునిండినంత సంతృప్తి కలిగింది.

"ఎకరానికి ముప్పయ్ కింటాళ్ళు అవతయ్. ఇప్పుడు ఐదేలు ధర ఉంది. రేపు నాలుగేలు వున్నా ఎకరానికి లక్ష గట్టిగా వస్తయ్. రెండెకరాల మీద రెండు లక్షలు!" అన్నాడు ఎలమంద.

"ఎంత డబ్బయ్య! అయితే ఒక్కోసారి తిన్న దాక నమ్మకం వుండదు" అంది కొండమ్మ కొంత భయంగా.

ఎలమంద మూడు ఎకరాల రైతు. తన సొంత పొలంతో పాటు ప్రతి ఏడు కౌలు పొలం వేస్తుం టాడు. నిరుడు పది ఎకరాలు కౌలు పొలం తీసు కుంటే, ఇయ్యేడు మరో రెండు ఎకరాలు కలిపి పన్నెండు ఎకరాలు కౌలు పొలం, తన సొంత పొలంతో కలిపి మొత్తం పదిహేను ఎకరాల్లో పంట వేసాడు. రెండు ఎకరాలు మిరప, పదమూడు ఎక రాలు శనగ.

నిరుడు మొత్తం శనగ పంటే వేసాడు. అయితే అప్పుడు కొనే నాథుడు ఎవరూ లేక, శనగలు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకని, చాలా ఇబ్బందులు పడి చివరికి మార్కెఫెడ్ వాళ్ళకి అతి తక్కువ ధరకు అమ్ముకుని బయటపడ్డాడు. నష్టం రాకున్నా లాభం కూడా లేదు. చేసిన చాకిరీ, శ్రమా, కష్టమూ అన్నీ వ్యర్థమే! అంతకు ముందు ఏడాది శనగల్ని అలాగే కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసి 42 వందలకి అడిగితే ఇవ్వకుండా, ఇంకా ధర వస్తుందనే దురాశతో వుంచుకుని 20 వందలకే అమ్ముకున్నాడు. క్వింటా ల్‌కి 42వందలు ఎక్కడా, 20 వందలు ఎక్కాడా? వంద క్వింటాళ్ళ మీద ధరలోనే రెండు లక్షల నష్టం గూబకి అంటింది. మొదట్లో చాలా లాభం వస్తుం దని భావిస్తే, చివరికి 40 వేలు దండగ వచ్చింది. చేజేతులా తెచ్చుకున్న దండగ.

మిరప చేను దగ్గర నించి ఇద్దరూ శనగ చేల దగ్గరకి వెళ్ళారు.

అక్కడక్కడా కొంత మంది రైతులు శనగ కల్లాలు చేస్తున్నారు.

శనగ కోతకి వచ్చి పంట ఇంటికి రావడానికి సిద్ధంగా వుంది. వీళ్ళ కోతే ఆలస్యం. శనగ కూడా బాగా పండింది.


నాలుగు శనగ చేలూ చూసి మురిసిపోయారు.

ఏ పంట అయినా బాగుంటే అంతకు మించిన ఆనందం రైతుకి మరేం వుంటుంది?

"ఏయ్యో....ఇయ్యేడు శనగలు ఏసీలకి గీసీలకు తోలే పిచ్చి పన్లు చేయవాకు, ఎప్పుడు పంట అప్పుడు అమ్ముకుంటే ఏ గోలా వుండదు, ధర వచ్చుద్దని ఆశపడి ఏసీలో పెట్టి ఎంత దండగ పడ్డాం"

"అప్పుడు పెద్దమ్మోరు నెత్తికి ఎక్కింది లేవే, ఇయ్యేడు నువ్వు చెప్పినట్టే పంటని ఇంటికాడే అమ్ముకుందాం" మాట్లాడుకుంటూ, శనగ చేలు మొత్తం తిరిగి చూసి, సైకిల్ మీద ఇద్దరూ ఇంటి దారి పట్టారు.

కూలీల మేస్త్రీని బతిమాలి, ఆమెకి ఎంతో కొంత డబ్బు ఆశ చూపెట్టి, ఎలాగైనా పంట ఇంటికి చేర్చుకుందామని ఎలమందకి తొందరగా వుంది. ఏ



రైతుకైనా పంట తొందరగా ఇంటికి చేర్చుకోవాలనే వుంటుంది.

టీ తాగి, ముఠామేస్త్రీ సుబ్బమ్మ వాళ్ళింటికి వెళ్ళాడు. ఆమె ఎప్పుడే కొంతమంది కూలీల్ని తీసు కపోయి రైతుల పొలాల్లో పనులు చేయిస్తుంది.

ఎలమంద వెళ్ళే సరికి సుబ్బమ్మ ఇంటి దగ్గర రెండు మంచాల నిండా రైతులు కూర్చుని వున్నారు.

''ఏం సుబ్బమ్మా?''

''చూస్తున్నావుగా అన్నా...ఇప్పటికి ఇంక ఎంత మంది వచ్చిపోయారో! అందరూ ఒక్కసారే వచ్చి మీద పడితే ఎవురికి అని మనుషుల్ని తీసుకొచ్చేదీ? వాటి తాడు తెగ, చేలన్నీ ఒక్కసారే వచ్చాయి! ఎవ రికి వాళ్ళే గత్తర పడతంత్రి! నన్నేం చేయమంటా?'' అంది ఆమె నిస్సహాయంగా.

మంచాల మీద కూర్చున్న వాళ్ళు ఎన్నో సార్లు అడిగినా సుబ్బమ్మ వీలు కాదని చెప్పింది. విసు గుతో వాళ్ళు వెళ్ళిపోయే వరకు ఎలమంద అలాగే కూర్చున్నాడు.

''ఊళ్ళో కోతలు మొదలు పెట్టకముందునించీ నిన్ను అడుగుతున్నాగా. నువ్వు కోపిస్తానని చెప్పావు. నాలుగు రోజుల్నించీ రోజూ రేపుమాం టంటివీ!''

''నిజమే అన్నా, ఇయ్యాల పోయిన వాళ్ళకి కొరవుంది, రేపటితో అయిపోయిద్ది. ఎల్లుండి వచ్చి నీ చేలో వంగుతాం''

''పక్కన మిరపకాయలు కూడా వచ్చి వున్నయ్యి సుబ్బమ్మ, నన్ను గట్టున పడేసావంటే నీ మేలు మర్చిపోను, నీకు ఎంతో కొంత ఇస్తాలే!'

''సర్లే అన్నా, ఎల్లుండి వచ్చి నీ చేలు కోస్తాం అన్నాగా!' అంది సుబ్బమ్మ.

''ఎల్లుండి గట్టిగా రావాలి'' మరీ మరీ చెప్పి ఇంటికి వచ్చాడు ఎలమంద.

చేలు చూసి వచ్చిన దగ్గరనించీ కొండమ్మ మనసు ఆనందంతో పూర్తిగా నిండిపోయింది.

ఎంత లేదనుకున్నా మిరపకాయల్లో లక్షన్నరా, శనగల్లో లక్షన్నర మొత్తం మూడు లక్షలకి పైగానే డబ్బులు వస్తాయి తప్ప తగ్గవు. లక్షన్నర ఖర్చులు పోయినా లక్షన్నర మిగుల్తాయి.

నాలుగేళ్ళనించీ వ్యవసాయంలో కుటుంబ ఖర్చులు వెళ్లబారిపోతున్నాయి తప్ప రూపాయి మిగల్లేదు. ఒక ఏడు సరైన ధరల్లేకా, ఒక ఏడు మంచి ధరలు వున్నా సరైన సమయంలో అమ్ముకో లేకా, ఒక ఏడు వానల్లేక పంట పండకా, ఇలా ఏటా ఏదో ఒక దెబ్బ తగులుతూ రూపాయి వెనుకబడ లేదు. కష్టమే తప్ప సుఖం లేదు. ఇయ్యేటితో కష్టాలు గట్టెక్కినట్టే.

''ఏయ్యా...ఇయ్యేడయినా మంచి సమ్మంధం చూసి అమ్మాయికి పెళ్ళి చేద్దామయ్యా! ఇయ్యేడు పంటలో మిగిలే డబ్బూ, ఒక ఎకరం పొలం ఇచ్చి పెళ్ళి చేద్దాం'' రాత్రి భర్తతో అంది కొండమ్మ.

ఎలమంద చాలా సేపు మాట్లాడలేదు.

''మాట్లాడవేందీ? ఇయ్యేడు కూడా ఆపుదామా ఏంది? పిల్లకి ఐదారేళ్ళ నాడే చేయాల్సిన పెళ్ళి, అమ్మాయి ఎదిగి ఎన్నేళ్ళవతంది? వెనుక ఇంకో ఇద్దరు వున్నారు. ముందు ముందు ఇంకా గడ్డుగానే వుండిద్ది ఎవారం'' భర్త మనస్సులో వుద్దేశాన్ని గ్రహించిన కొండమ్మ కూతురికి పెళ్ళి కాలేదనే బాధతోనూ, వెనుక ఇంకా ఇద్దరు వున్నారనే వేదన తోనూ అంది.

''చేద్దామే, అమ్మాయికి పెళ్ళి చేయడం నాకు ఇష్టం లేనట్టు మాట్టాడతావేమో! కొంప చూస్తే ఇట్ట వుండే, మన కొంపని చూసి మంచి సంమ్మంధాలు ఏం వస్తయే? వచ్చినోడు ఎనక్కిపోతాడు,ఇయ్యేడు ఇల్లు కట్టుకుందాం. ఆగినంత కాలం ఆగాం, వచ్చే ఏడు ఎంతయినా కట్నం ఇచ్చి మంచి సమ్మంధం చేద్దామే!''

''ఎంతయినా ఎక్కడ తెచ్చి ఇస్తా? అక్కడ వుండొద్దూ! లేనిది ఏమిస్తా? కాలం బాగలేదు. జనం ఆక్షేపిస్తారు. చేతిలో డబ్బులేక ఆగినంత కాలం ఆగాం. మీదటికి ఎట్ట వుండిద్దో, ఏం పాడో! ఎందు కొచ్చిన బాధ? ముందు అమ్మాయికి పెళ్ళి చేద్దాం. తరువాతనే ఇల్లు'' తేల్చినట్టు మాట్లాడింది కొండమ్మ.

''సరే కానీ, మంచి మనువు చేసి చేద్దాం. నీ మాటని ఎందుకు కాదనాలా?'' అన్నాడు ఎలమంద.

ఆ దంపతులకి ముగ్గురు కూతుళ్ళు. పెద్ద కూతురు డిగ్రీ చివరి ఏడాది చదువుతోంది. చదు వులో చురుకు లేదు. పదో తరగతి ఫెయిలై ఒక ఏడూ, ఇంటర్ ఫెయిలై ఒక ఏడు, ఇలా రెండేళ్ళు ఇంటి దగ్గర వుండి, అతి కష్టం మీద బొటబొటి మార్కులతో డిగ్రీ చదువుతోంది.

అమ్మానాన్నలకి ఆ అమ్మాయి చదువు మీద ఆశలేం లేవు. పెళ్ళి కావాల్సిన అమ్మాయిని ఇంటి దగ్గర వుంచడం ఎందుకని కాలేజీకి పంపిస్తున్నారు. తరువాత అమ్మాయిలు ఇద్దరూ ఇంటర్ మొదటి ఏడాది ఒకరూ, రెండో ఏడాది ఒకరూ చదువుతు న్నారు. చదువులో వీళ్ళు బాగుంటారు.

****

మరుసటి రోజు సుబ్బమ్మ వాళ్ళింటికి మళ్ళీ వెళ్ళాడు ఎలమంద.

''రేపు వచ్చి నీ చేలు కోస్తాం ఎలమందన్నా! నువ్వు మూడు గంటలకి ట్రాక్టరు తీసకరా! ట్రాక్టర్ మాట్లాడుకున్నావుగా, తెల్లారేసరికి సగానికి పైగా కోత కావాల. నువ్వు ఎంత పెందలాడి వస్తే అంత పెదలాడే పోదాం. రేపు ఆగి ఎల్లుండి కల్లం వేసు కుందువు'' అంది సుబ్బమ్మ.

సంతోషంగా ఇంటికి వచ్చాడు ఎలమంద. తొందరగా శనగ కల్లాలు ఒబ్బిడి చేసుకుంటే, తరు వాత మిరపకాయలు కోయించుకోవచ్చు.

మెలకువ వస్తుందో, రాదో అని సరిగా నిద్ర కూడా పోలేదు. కలత నిద్రే. రెండు గంటలకే లేచాడు. ట్రాక్టర్ వాళ్ళింటికి వెళ్ళి, డ్రైవర్ని లేవగొట్టు కుని సుబ్బమ్మ వాళ్ళింటి దగ్గరికి ట్రాక్టర్ తీసుక పోయి నిలిపాడు.


అమావాస్య రెండు రోజులే వుంది. కటిక చీకటి.

అప్పటికే సుబ్బమ్మ లేచి, వాడ అంతా తిరిగి కూలీల్ని లేపింది.

కూలీలు అందరూ వచ్చి ట్రాక్టర్ ఎక్కారు. కంట్రాక్ట్ కూలి. ఎకరానికి ఆరువందలు.

శనగ ఎండపొడ తగలకముందే కోయాలి. ఎంబడితే కాయరాల్తాంది.

కూలీలు 8 గంటలకే ఇళ్ళకి తిరిగి వచ్చి,



అన్నాలు తిని, మళ్ళీ పదిగంటలకి కల్లాలకి వెళ్ళారు.

సుబ్బమ్మ కులీల్ని తిడుతూ, పెద్ద పెద్ద కేకలు పెడుతూ, వెనకబడిన వాళ్ళని అరుస్తూ పని చేయిస్తోంది. కంట్రాక్ట్ పని కావడంతో కూలీలు రేసు గుర్రాల్లా పొలం మీద పడి లాగిపారేస్తున్నారు. 60 మంది ముఠా, తెల్లవారే సరికి ఐదు ఎకరాలూ, తెల్లావారిన తరువాత ఐదు ఎకరాలు కోసి, 8 గంటలకి ట్రాక్టర్ మీద ఇంటికి చేరుకున్నారు.

''కల్లాలు రేపు చెద్దాం,గోతాలు,చేటలు,పరజాలు,ట్రాక్టరూ అన్నీ చేసుకో ఎలమందన్నా'' ఇంటికి వచ్చిన తరువాత సుబ్బమ్మ చెప్పింది.

ఎలమంద అన్నం తిని, కొద్ది సేపు అలా మంచం మీద నడుం వాల్చి, లేచి ఎరువుల షాపు దగ్గరికి వెళ్ళాడు. వాళ్ళు గోతాలు కూడా అమ్ముతారు. ఖాళీ గోతాలు రెండు వందలు తీసుకొని, ఇంటికి చేర్చాడు. కొండమ్మ అంతకుముందే చేటలు అలికి సిద్ధం చేసి పెట్టింది. పరజాలు అద్దెకి ఇచ్చే అతని దగ్గరకి వెళ్ళి పరజాలు చెప్పివచ్చాడు.

పొద్దున్నే పని తెమలదనే వుద్దేశంతో కొండమ్మ అంట్లు తోముకుని, బియ్యం కడుక్కుని, వంటకి అన్నీ సిద్ధం చేసి పెట్టుకుంది.

ఎలమందా,కొండమ్మా,పిల్లలూ పంట ఇంటికి వస్తున్న ఆనందంతో కబుర్లు చెప్పుకుంటూ, సరదగా మాట్లాడుకుంటూ, పంటా, దాని మీద వచ్చే డబ్బూ, మిగులూ గురించి లెక్కలు వేసుకుంటూ ప్రశాంతంగా పడుకున్నారు.

రాత్రి రెండు గంటల జాము.

ఉరుముల శబ్దంతో కొండమ్మకీ, ఎలమందకీ ఒక్కసారిగా మెలకువ వచ్చింది.

''వానగానీ వచ్చిద్దేందే,ఉరుంతుందీ'' అంటూ ఎలమంద బయటికి వచ్చి ఆకాశం వైపు చూసాడు.

'' ఈ రోజుల్లో వాన ఎందయ్యా?'' అని కొండమ్మ కూడా బయటికి వచ్చింది.

నల్లగా చీకట్లు కమ్ముకుని వాన మొదలైంది..

''పండిన పంట...కోసి చేను మీద ఉంది.... వాన దెబ్బతీసిద్దేమొ...నోటికాడి పంట...ఆరుముద్దై పోయిద్దేమో...'' అని భయపడుతూ, ఆందోళన పడుతూ తెల్లవారే వరకూ అలాగే కూర్చున్నాడు ఎలమంద.

తెల్లవారడమే ఆలస్యం, వీధులనిండా జనమే. ఎలమంద కూడా వేప్పుల్ల నోట్లో పెట్టుకుని పొలం వైపు వెళ్ళాడు.

పొలం చేసిన తరువాత కొద్దిగా మనసు శాంతించింది. పెద్ద వాన ఏం కాదు. పొలంలో ఆ వాన లెక్కలోనిది కాదు.

''ఏయ్యా?'' ఇంటికి వచ్చిన తరువాత భార్య అడిగింది., వాకిట్లోనే కూర్చుని.

''ఈ వాన ఇంతటితో పోతే ఏం కాదే, మబ్బులు మూసుకుని వస్తున్నాయి. ఇంకో వానపడితే మాత్రం ఇయ్యేడు లేచే పని కాదు''

ఉదయం పది గంటల వరకూ చీకట్లు కమ్ముకుని రైతుల గుండెల్లో గుబులు పుట్టించిన మేఘాలు నెమ్మదిగా విడిపోయాయి. ఎండ వచ్చింది.

''హమ్మయ్య'' అని వూపిరి పీల్చుకున్నాడు ఎలమంద.

''ఏం సుబ్బమ్మా...వానపడి పని ఆగిపోయే... లేకపోతే ఈ పాటికి పంట ఇంటికి వచ్చి వుండేది. పంట యేసుకోవడానికి నేను అద్దెకి తీసుకున్న రేకుల షెడ్డు నిండిపోయి వుండేది. రేపు చేద్దాం కల్లం. ఏదిపోయి ఎట్ట వచ్చిద్దో...నలుగురు మనుషుల్ని కలగానే తీసకరా..మంచోళ్ళని చూసి తీసకరా మూటలు మోయడానికి, గోతాలు పట్టడానికీ!''

'' నీ కెందుకు నువ్వు పో అన్నా! నీకు కల్లం వైనంగా చేసి, నీ గింజ ఇంటికి చేర్చే పూచినాది, మంచోళ్ళని తీసకొస్తాలే!''


పిల్లలు లేని దంపతుల ఆశాకిరణం...



SUCCESS

డా॥ పద్మజా సంతాన సాఫల్య కేంద్రం - భువనగిరి

నవ్య నర్సింగ్ హోం, MATERNITY - SURGICAL - FERTILITY

PH: 08685 - 243123 / 243200. CELL: 99480 44665

email: drpadmajaivf@yahoo.com, Fax: 08685-244666

సంతాన సాఫల్య వైద్య విధానంలో వచ్చిన అన్ని ఆధునిక పరికరాలతో, ప్రపంచ స్థాయి సౌకర్యాలతో



''టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్''



మళ్ళీ పిల్లల కోసం రీకానలైజేషన్ (రివర్స్ ట్యూబెక్టమీ)

ఐ.యు.ఐ. విధానం: భర్త వీర్యం శుద్ధిపరచి గర్భసంచిలో ఇంజెక్షన్ ద్వారా పొందుపరచడం

ఐ.వి.ఎఫ్. విధానం: శుద్ధిపరచిన వీర్యకణాలను, అండాలను ల్యాబ్‌లో ఫలదీకరించి, పిండం తల్లిగర్భంలో పొందుపర్చడం.

ఐ.సి.ఎస్.ఐ.(ఇక్సీ) విధానం: మరీ తక్కువ వీర్యకణాలున్నపుడు అండంలోకి ఒకే వీర్యకణం మైక్రో ఇంజెక్షన్ ద్వారా చేర్చి ఫలితం సాధించండి.

❖ స్త్రీలలో గర్భాశయం, అండాశయం, అండవాహికలో లోపాల నిర్ధారణ - చికిత్స, ❖ పురుషుల్లో సంతానప్రాప్తి లోపాలు, వివిధ సమస్యల నిర్ధారణ - చికిత్స, ❖ అత్యంత ఆధునికమైన పాథాలజీ, మైక్రోబయాలజీ ల్యాబ్, ❖ ల్యాప్రోస్కోపిక్ విధానంలో లోపాల నిర్ధారణ - సవరణ వంటి ఆధునిక వైద్య విధానాలతో మీ ఆకాంక్ష నెరవేర్చుకోవడానికి... మీ కలలు సాకారం చేసుకోవడానికి సంప్రదించండి.



డా॥ పద్మజా దివాకర్

సంతాన సాఫల్య వైద్యనిపుణులు

ఆకాశంలో చుక్కలు మెరుస్తున్నాయి. ఇక వాన పోయినట్టే అనుకున్నాడు ఎలమంద,

అంతకు ముందు రాత్రి వచ్చిన వేళకే మళ్ళీ వాన మొదలైంది. అయితే ఇది మామూలు వాన కాదు.

కుంభవృష్టి! కుండపోత! ఎడతెరిపి లేని వాన!

ఎలమందకీ, కొండమ్మకీ, పిల్లలకీ వానలో వున్నట్టే వుంది. ఇంటి నిండా నీరే!

పైనించి కారడం, కింద మడుగు!

ఇంట్లో మోకాల లోతు నీళ్ళు నిలిచిపోయాయి. మంచాలూ, కంచాలూ, ఇంట్లో వున్న సమస్త వస్తువులూ నీటిలో మునిగిపోయాయి.

తెల్లవారే వరకూ ఒకటే వాన, ఆగకుండా ధమ ధమా బాది పారేసింది.

బావులూ, చెరువులూ,కుంటలూ,వాగులూ, వంకలూ ఏకమైపోయాయి. నేల కనపట్టం లేదు. అంతటా నీరే! ప్రవాహం! ఇంకా వానపడుతూనే ఉంది.

ఎలమంద, కొండమ్మ ఇద్దరూ ఏడుపు దిగమింగుకుంటూనే పొలం వెళ్ళారు. ఆ వానలోనే,

పొలంలో ఏముంది? కోసిన శనగ తుడిచిపెట్టినట్లుగా వెల్లువకి కొట్టుకపోయింది.

కౌలు పొలం లక్ష పెట్టుబడి దాటింది. లక్షకి పైగా మిగుల్తుందని భావించిన పంట!

మిరప చేలోకి వెళ్ళారు. మిరప కాయలు రాలి నేల మీద పడి, కొన్ని కెరూలు నీటిలో కొట్టుకపోగా, కొన్ని కాయలు మట్టి కొట్టుకపోయాయి.

''పెట్టిన పెట్టుబడి కూడా పోగొట్టుకున్నామే! నిలువునా ఆరిపోయాం...నోటికాడికి వచ్చిన పంటని దేవుడు కాజేసుకున్నాడు. కంచంలో పెట్టుకుని తినబోయే సమయంలో లాక్కపోయాడు.'' అన్నాడు ఎలమంద కళ్ళు తుడుచుకుంటూ.

కొండమ్మకి నోట్లోనించి మాట కూడా రాలేదు.

''బిడ్డకి ఇంకేం పెళ్ళి చేస్తాం? ఇల్లు ఇంకేం కట్టుకుంటాం? తెచ్చిన అప్పులు ఎట్ట తీరుస్తాం? ఇద్దరం కట్టకట్టుకుని చావాల్సిందే, అంతకు మించిదారి లేదు'' అన్నాడు ఆ రైతు దిగాలుగా, విచారంగా, నిరాశగా కన్నీళ్ళు తుడుచుకుంటూ.

ఇద్దరూ ఏడ్చుకుంటూనే ఇంటికి వచ్చారు. రోజంతా అన్నం తినలేదు. పచ్చి మంచినీళ్ళు ముట్టలేదు.

వాన ఇంకా పడుతూనే ఉంది. తెరిపి ఇచ్చినట్లే ఇచ్చి, తిరిగి ఉధృతమైంది.

★

# ప్రస్థానం




తీర్థయాత్రలో తొలి తీపి అడుగు వేశాం!
ఉరకలేసే ఉత్సాహం,
ఉన్నతమైన ఆలోచనలు,
అలసటను దరిచేరనివ్వలేదు!
మలిదశలో మొలకెత్తిన సందేహాల్ని
ఉబుకుతున్న ఉల్లాసం అదిమేసింది.
భానుడి ప్రతాపం, మా దృఢ సంకల్పం పోటీ పడ్డాయి!
పరీక్షలో నెగ్గామనే అనుకున్నాను,
రైతుల బేరసారాలు
అన్నీ గమనిస్తున్నాను
తెల్ల కాగితాలు నల్లగా మారుతున్నాయి నా ఆలోచనలతో.
ఒక జ్ఞాని దిశానిర్దేశం చేసిన మూడు నగరాలు
మా తదుపరి మజిలీ.
ఇంతలో ఒక ఏడారి
ఎలా దాటాలన్న మీ మాంస.
తర్జన భర్జనలు...
అభిప్రాయ భేదాలు
అనర్గళంగా మాట్లాడగల ఒక మిత్రుడు
వీడ్కోలు పలికాడు.
మీద పడ్డ నీడ ఎదుగుతోంది.
ప్రస్థానం సాగుతూనే ఉంది.
రెండు సార్లు దోపిడీ,
మా బృందం దారి తప్పింది.
నిరాశ ఆవరిస్తుంటే సందేహాలు తరుముతున్నాయి...
మాలో కొందరు సెలవు పుచ్చుకున్నారు...
ఏదో తెలియని బాధ
ఇంతలో మా నాయకుడి ఉత్సాహం!
సముద్రం వాసన తగులుతోందని,
ఎవరిలోనూ లేదు మునుపటి హుషారు
ఆశ ఆవిరైపోయింది.
యాంత్రికంగా అడుగులు వేస్తున్నాం.
ఉరుములు ఏ సందేశమిస్తాయి
నిరాశల ఊబిలో కూరుకుపోయిన వారికి?
కనీస అవసరాలు కూడా తీరని దుస్థితి.
కొందరు చితికిపోతే మరికొందరు నలిగిపోయారు.
చిట్టచివరకు చేరాం మా గమ్యం.
ఎందుకు బయలుదేరాం?
వివర్ణ వదనాలు, మసిబారిన మనసులు
ఏం ఘనత సాధించాం?
గృహమే కదా
స్వర్గ సీమ?

**ఆంగ్ల మూలం : ''ఎంటర్‌ప్రైజ్''–నిసిమ్ ఎజికిల్**
**స్వేచ్ఛానువాదం : డాక్టర్ వడ్లమన్నాటి నరేంద్రకుమార్**